
ఆకాశంలో సగం.. అవకాశాల్లో అగ్రం

ఇంటి తలుపు తట్టి పింఛనిచ్చే వలంటీరు ఆమె..
సచివాలయంలో కొలువుదీరిన కార్యదర్శి ఆమె..
తల్లిగా ఇంటికే కాదు..
పల్లె తల్లిని బాగు చేసే సర్పంచూ ఆమె..
చట్టాలు చేసే సభల్లో ప్రతినిధి కూడా ఆమె..
ఇప్పుడామె ఆకాశంలో సగం కాదు..
అవకాశాల్లో అగ్రభాగమై ప్రగతిపథంలో పయనిస్తోంది.
వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'ఆమె'ను అన్నింటా
అందలమెక్కించడంతో నిలువెత్తు జెండాలా
సగర్వమై రెపరెపలాడుతోంది.



మహిళా మార్టు.. సూపర్ హిట్టు!

పులివెందుల రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ముఖ్యమంత్రి చేయూతతో ముందుకు దూసుకెళ్తున్నారు. 2021 జనవరి 3న పులివెందులలో తొలిసారిగా జగనన్న మహిళా మార్టు ఏర్పాటు చేశారు. 'మహిళలే పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు, లాభదారులు' అనే సంకల్పంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ మార్టులో వచ్చే లాభాలు ఆయా సంఘాలు పంచుకుంటాయి.

ఒక్కో సంఘం జగనన్న మహిళా మార్టులో పెట్టుబడి కింద రూ.1500లు పెట్టుబడి పెట్టారు. బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు విక్రయించే విధంగా ప్రభుత్వ, మెప్మా ఎండీ విజయలక్ష్మి ఆదేశాల మేరకు తొలిసారిగా పులివెందులలో మహిళా మార్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 15 జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేసి మహిళలనే యజమానులుగా, కొనుగోలుదారులుగా ఏర్పాటు చేశారు. తమ కాళ్లమీద నిలబడి కుటుంబాలను పోషించుకుంటున్నందుకు సంతోషంగా ఉందని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


జగనన్న మహిళా మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న మహిళలు

చాలా ఆనందంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతూ వారిని లక్షాధికారులు చేయాలని జగనన్న మహిళా మార్టులను ఏర్పాటు చేశారు. జగనన్న మహిళా మార్టులో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. బయట మార్కెట్ కంటే నిత్యావసర వస్తువులు తక్కువధరకే లభిస్తాయి. -హరిత (కమ్యూనిటీ ఆర్గనైజర్, మెప్మా)

మహిళలు యజమానులుగా ఎదగాలి



ప్రతి మహిళ యజమానులుగా ఎదిగినప్పుడే సార్థకత ఉంటుంది. మహిళల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు వెళ్తున్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. -రమణమ్మ, సంఘ సభ్యురాలు

మా పిల్లల విద్యకు దోహదం



నా పేరు సైదాభాను. అనపగుట్టలో నివాసమున్నాము. నా భర్త సలీం పెయింటర్. నా కొడుకు సయ్యద్‌బాషాను చదివించాలంటే కష్టంగా ఉండేది. మెకానిక్ పనులకు పంపుదామనుకున్నాం. ఇలాంటి సమయంలో జగనన్న అమ్మ ఒడి పథకం పెట్టి ప్రతి ఏడాది రూ.15 వేలు ఇస్తున్నారు.

నా బిడ్డ చదువు జగనన్న చలువే



నా పేరు షేక్ అస్మా. మదనపల్లె పట్టణం అనపగుట్టలో నివాసమున్నాము. నా భర్త కార్పెంటర్. నా బిడ్డను చదివించాలంటే కష్టంగా ఉండేది. ఇలాంటి సమయంలో జగనన్న అమ్మ ఒడి ప్రవేశపెట్టారు. దీంతో నా కుమార్తెను పాఠశాలకు పంపుతున్నా. నా బిడ్డ తిరిగి చదువుకుంటుందంటే జగనన్న చలువే.

మహిళా సాధికారతకు నిజమైన అర్థం



మహిళా సాధికారతకు నిజమైన అర్థం చెప్పింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. మహిళలకు స్థానిక సంస్థల్లో మాత్రమే కాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ, నామినేషన్ కాంట్రాక్ట్ పనుల్లోనూ 50 శాతం ఇచ్చేలా ఏకంగా చట్టం చేసిన ప్రభుత్వం జగనన్నది. సచివాలయాల్లో సగానికి పైగా మహిళలు ఉద్యోగాల్లో ఉన్నారు. మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారు.
– షమీమ్‌అస్లాం, ఏపీఎండీసీ చైర్‌పర్సన్

ఆలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి



రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించాను. ఆలయ ఆదాయాన్ని పెంచుతూ వచ్చిన భక్తులకు ఉచితంగా మూడు పూటల భోజన సౌకర్యం కలిపిస్తున్నాము. నేను ఇప్పటి వరకు మూడు టర్మ్‌లు అంటే నాలుగు ఏళ్లుగా శ్రీ వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్‌పర్సన్‌గా చేస్తున్నాను.
-పోలంరెడ్డి విజయ, చైర్‌పర్సన్, శ్రీ వీరభద్రస్వామి ఆలయ కమిటీ, రాయచోటి

జగనన్న ప్రభుత్వంలో రక్షణ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు రక్షణగా నిలిచింది. దిశా చట్టం, ఎస్ఓఎస్ అమలు చేయడం ద్వారా మహిళలకు రక్షణ కలుగుతోంది. మహిళా సాధికారత, ఆర్థిక, రాజకీయ స్వావలంబన, మహిళలపై శ్రద్ధ తీసుకుంటోంది. – జింకా విజయలక్ష్మి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్.

ఇంటి నుంచే సమానత్వం



సమాజంలో మహిళలకు సమానహక్కులు ఇంటి నుంచే ప్రారంభం కావాలి. ఆడ, మగ అన్న తేడా లేకుండా సమానత్వపు వాతావరణం కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని సృష్టించగలం. కుటుంబ, సమాజ, దేశ ప్రగతిలో మహిళల పాత్ర కీలకం. – ఆచార్య రమాదేవి, మహిళాసెల్ సమన్వయకర్త, వైవీయూ

సంతోషంగా ఉంది



రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంకు సొసైటీ లిమిటెడ్ పెద్ద సంస్థ. వ్యాపార లావాదేవీల్లో ఆప్కాబ్ రూ.40వేల కోట్ల మైలురాయికి చేరడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. నాపై నమ్మకం ఉంచి సీఎం జగనన్న ఆప్కాబ్ చైర్‌పర్సన్‌గా నన్ను నియమించారు. సంతోషంగా ఉంది.
– ఝాన్సీరాణి, ఆప్కాబ్ చైర్‌పర్సన్

మహిళా సాధికారతకు కృషి



మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం లక్షల్లో రుణాలు అందించి వారి కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రాజకీయ పదవులతో పాటు ఉద్యోగాల కల్పనలో కూడా రిజర్వేషన్ కల్పించి మహిళలను ఎంతో ప్రోత్సహిస్తుండడం అభినందనీయం. – అనురాధ, డీఈఓ

న్యూస్‌రీల్

9న కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో సెకెండరీ గ్రేడ్ టీచర్స్‌గా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్‌ఎడ్యుకేషన్) పోస్టుకు పదోన్నతులకు 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఆరోజు ఉదయం కడప డీఈఓ కార్యాలయంలో వెరిఫికేషన్ , మధ్యాహ్నం 2 గంటలకు పదోన్నతులు కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు.

కమలాపురం, ప్రొద్దుటూరు పరిశీలకుల నియామకం


రవి కుమార్‌రెడ్డి


హనుమంతరెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం, ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కమలాపురం నియోజకవర్గం పరిశీలకులుగా రవి కుమార్‌రెడ్డి (వేంపల్లె), ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిశీలకులుగా హనుమంతరెడ్డి(జమ్మలమడుగు) లను నియమించారు.

హానర్స్ డిగ్రీ ఫలితాలు విడుదల

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ హానర్స్ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ సుధాకర్ విడుదల చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఈశ్వరరెడ్డితో కలిసి ఫలితాలను వెల్లడించారు.

14న నేషనల్ వర్క్‌షాప్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం సహ ఆచార్యులు ఎస్వీ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈనెల 14న 'బయోడైవర్సిటీ – బటర్ ఫ్లై బయాలజీ అండ్ కన్జర్వేషన్ మేనేజ్మెంట్– 2024' నినాదంతో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీతాకోక చిలుకలపై జాతీయ సదస్సు నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిది అన్నారు.

సమర్థవంతంగా అభివృద్ధి పనులు

కలెక్టర్ వి.విజయ రామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హౌసింగ్ పథకంతోపాటు అన్ని రకాల అభివృద్ధి పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. గురువారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి.. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ 2024–25 నిర్వహణపై సూచనలు, పీఎం ఔట్ రీచ్ ప్రోగ్రాం, రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇనామ్ – అసైన్డ్ భూములు, హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్స్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు, జేసీ గణేష్ కుమార్, డిఆర్వో గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రయారిటీ సెక్టార్ల వారీగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనుల లేబర్ కాంపోనెంట్, కూలీలకు కొరత లేకుండా తాగునీటి సదుపాయం, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ 2024–25 లో జిల్లా నుంచి విస్తృతంగా పాల్గొనేలా యువతను ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్‌లకు పదోన్నతులు

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో గురువారం స్టాఫ్ నర్స్ నుంచి హెడ్ నర్స్‌గా నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అర్హులైన 14 మందికి గాను 9 మంది పదోన్నతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాల ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అతావుల్లా, బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.


హెడ్ నర్స్‌లుగా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ డాక్టర్ రత్నకుమారి

శంభో శివ శంభో

నేడు మహాశివరాత్రి



కడప కల్చరల్: మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలు అందంగా ముస్తాబయ్యాయి. మన జిల్లాలో ప్రముఖ శివాలయాలు అందులోనూ అటవీ ప్రాంతాల్లో ఉన్న ఆలయాల సంఖ్య 15కు పైగానే ఉంది. ఒకప్పుడు ఈ జిల్లాలో శైవం బాగా విస్తరిల్లింది. జిల్లాలో వీరశైవ ఆలయాలు కూడా ఉండడంతో అటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా శివరాత్రి సందర్భంగా భక్తులు ఈ జిల్లాకు వస్తుంటారు. పుష్పగిరి, చిట్వేలి, దేవునికడప తదితర ప్రాంతాలలో శైవ, వైష్ణవ ఆలయాలు పక్కపక్కనే ఉండడం విశేషం. నిత్యపూజస్వామిని భక్తులు వైష్ణవ సంప్రదాయంలోనే అర్చిస్తారు. కాగా అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాల్లో శుక్రవారం శివరాత్రి పూజలు నిర్వహించడానికి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, పంచాయతీరాజ్, అగ్నిమాపకశాఖ, పోలీసు, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్యశాఖ తదితర ప్రభుత్వ శాఖల సహకారంతో ఇప్పటికే పలు మార్లు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలను పరిశీలించారు. పోలీసు అధికారులు కూడా తమ పరిధిలోని శైవ క్షేత్రాలకు బందోబస్తు కోసం తరలివెళ్లారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో గురువారం ఉదయం నుంచి భక్తులు అటవీ క్షేత్రాల బాటపట్టారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. గురువారం మధ్యాహ్నానికే అటవీ ప్రాంతాల దారులు జనమయం అయ్యాయి. సాయంత్రానికి ఆయా క్షేత్రాలు భక్తులతో రద్దీగామారాయి.

భక్తజన ప్రవాహం

శివరాత్రి సందర్భంగా పొలతల, నిత్యపూజస్వామికోన, అత్తిరాల, భైరవకోన, గుండాలకోన, కపర్దీశ్వరకోన, కన్యతీర్థం, భానుకోట తదితర ప్రాంతాలకు భక్తులు భారీగా హాజరవుతారు. కొండకు వెళ్లే భక్తులకు ధార్మిక సంఘాల ప్రతినిధులు ఆహార పొట్లాలు, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అటవీ ప్రాంతాలతోపాటు గ్రామాలు, పట్టణాలు, కడప నగరంలోని శివాలయాలలో కూడా వైభవంగా పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు అన్ని ఆలయాలలో పండుగ సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి వరకు భజనలు, ప్రవచనాలు, భక్తి గీతాలాపనలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి లింగోద్భవం సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు.

అక్కచెల్లెమ్మలకు... ఆర్థిక చేయూత

- వైఎస్సార్ చేయూత కింద రూ. 172.06 కోట్లు ఖాతాల్లో జమ
- జిల్లాలో 91,767 మందికి లబ్ధి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం జిల్లాలో వేలాది మంది మహిళల జీవితాల్లో వెలుగును నింపుతోందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అన్నారు. నాల్గవ విడత వైఎస్సార్ చేయూత సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా జేసీతో పాటు రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, సురేష్ రెడ్డి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు వెంకటసుబ్బయ్య, జయసింహా తిలకించారు. అనంతరం జిల్లాలోని 91,767 మంది లబ్ధిదారులకు సంబంధించిన రూ. 172,06,31,250 మెగా చెక్కును జేసీ అందజేశారు. వైఎస్సార్ చేయూత ద్వారా 24,141 మంది ఎస్సీలు, 2387 మంది ఎస్టీలు, 62,312 మంది బీసీలు, 2811 మంది మైనార్టీలు, 116 మంది క్రిస్టియన్లకు ఒక్కొక్కరికి రూ. 18,750 చొప్పున రూ. 172.06 కోట్లు మంజూరైంది.


లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ గణేష్‌కుమార్

మహిళల ఆర్థిక ప్రగతికి వారధి



జగనన్న లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించడం.. మహిళ అదృష్టంగా భావిస్తున్నాం. మా కుటుంబం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన పథకాలను అందుకుంటోంది. 'వైఎస్ఆర్ చేయూత' ద్వారా మా సంఘంలో మహిళలందరికీ 4వ విడత ఆర్థిక సాయం అందింది. ఆయన చేస్తున్న సాయం.. మా ఆర్థిక ప్రగతికి వారధిగా మారింది. – టి.గ్రేసమ్మ, ప్రకాష్ నగర్, కడప

జగనన్న రుణం తీర్చుకోలేం



మహిళల సంక్షేమమే ధ్యేయంగా అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేనిది. నాలుగు ఏళ్లపాటు రూ.18,750 మొత్తాన్ని ఆర్థిక సాయం చేయడం గర్వించదగ్గ విషయం. టైలరింగ్ బిజినెస్ నిర్వహిస్తూ.. జీవిస్తున్న నాకు వ్యాపారాభివృద్ధి కోసం ఈ సాయం ఎంతో ఉపయోగపడుతోంది. – పి.కళావతి, సరోజిని నగర్, కడప

మహిళా దినోత్సవ కానుక



మహిళలు లక్షాధికారులు కావాలన్న ప్రభుత్వ లక్ష్యం అభినందనీయం. ఈరోజు ముఖ్యమంత్రి అందిస్తున్న 'వై.ఎస్.ఆర్. చేయూత' సాయం.. మహిళా దినోత్సవ కానుకగా స్వీకరిస్తున్నాం. 4వ ఏడాది చేయూత లబ్ధి పొందుతున్న నేను.. టైలరింగ్ పని చేస్తూ.. కిరాణా షాపు కూడా నిర్వహిస్తున్నాను. మహిళలు ఆర్థిక సాధికార సాధన కోసం జగనన్న చేస్తున్న కషి అభినందనీయం. – ఎం.మంజుల, మృత్యుంజయ కుంట, కడప

10న విద్యా సదస్సు


జేఏసీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేటు సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మేడా కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 10వ తేదీ ఆదివారం విద్యా సదస్సును నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం కడప అక్కాయపల్లెలో ఎమ్మెల్సీ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. నూతన విద్యా విధానంలో నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ పరంగా వచ్చిన మార్పులను ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులందరికి విద్యా సదస్సును ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ విద్యా సదస్సుకు ముఖ్య అతిథులుగా వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎంపీ మేడా రఘునాథరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, మేయర్ సురేష్‌బాబు వస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంఘ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బ్రహ్మంగారి కల్యాణం


– స్వామి కళ్యాణం తిలకించేందుకు తరలి రానున్న భక్తులు



విద్యుద్దీపాలంకరణలో బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రభోద కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబల కళ్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించనున్నారు. కళ్యాణం తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు. గురువారం ఉదయం సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి ఎనిమిది గంటలకు కళ్యాణం నిర్వహిస్తారు. అనంతరం హరికథ, 11 గంటలకు నరసందిని ఉత్సవం, జాగరణ ఉంటాయి.

అరటిపంట దగ్ధం



నాయునిపల్లెలో కాలిపోయిన అరటిపంట

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామానికి చెందిన కాశం నరసింహులు, పాము లేటి, తోడేటి సుబ్బమ్మ, వెంకటమ్మలకు చెందిన 6 ఎకరాల్లోని అరటిపంటకు నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయింది. రెండు, మూడు రోజుల్లో అరటికాయలు కోయాల్సి ఉండగా నిప్పంటుకుందని వాపోయారు. పోరుమామిళ్ల ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు యత్నించినా దాదాపు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

110 బస్తాల బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని భాకరాపేట సమీపంలోని ఓ ఇంట్లో 110 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఈదురుబాషా తెలిపిన వివరాల మేరకు ... భాకరాపేట సమీపంలోని ఓ ఇంటిలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషకు వచ్చిన సమాచారం మేరకు అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. 10 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన శ్రీనివాసులు, సునీల్‌లపై కేసు నమోదు చేసి బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్, విజిలెన్స్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచి

సచివాలయాల ప్రారంభోత్సవాల్లో ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి



చాగలేరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని మబ్బుచింతలపల్లె, పెద్దజూటూరు, చాగలేరు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో రూ.22.90 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, మొగమూరు వాగుపై వంతెన, ఏపీ టూరిజం కళ్యాణ మండపం, జగనన్న కాలనీలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థను అమలు చేసి దేశానికే జగనన్న ఆదర్శంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు మండల కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నష్టపోతే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. నల్లచెరువుపల్లె సమీపాన మొగమూరు వాగుకు వరదలు వస్తే రాకపోకలు స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడేవారని, రూ.15 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మించి ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. అంతకుముందు మబ్బుచింతలపల్లె లో జగనన్న కాలనీని ప్రారంభించి 23 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎంపీ పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ అనిల్ కుమార్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జ్ నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రజా ప్రతినిధులు శివాంజలి, లక్ష్మీదేవి, రామలక్ష్మమ్మ, అర్జున్, చెన్నారెడ్డి, రంగనాథం, రామాంజనేయరెడ్డి, పీ.రవిచంద్రారెడ్డి, నాయకులు గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యతోనే వివక్ష లేని సమాజం

మహిళా దినోత్సవ వేడుకల్లో వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : ప్రతి బాలిక ఉన్నత విద్యావంతురాలు కావాలని, తద్వారా వివక్ష లేని సమాజాన్ని సంపూర్ణంగా చూడవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూలోని సురభి సమావేశ మందిరంలో గురువారం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ మహిళల ప్రగతి ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎస్కేయూ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి. కుసుమకుమారి మాట్లాడుతూ మహిళలు వారి హక్కును సాధించి తీసుకోవాలన్నారు. మహిళల అభ్యుదయం కోసం రాజా రామ్మోహన్ రాయ్, వీరేశలింగం వంటి సంఘసంస్కర్తలు కృషి చేశారని తెలిపారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విశ్వవిద్యాలయాల పాలకమండలిలో 50 శాతం మందిని తీసుకున్నారని తెలిపారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రవేశించని రంగం లేదని, ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం ఉందని స్పష్టం చేశారు. పాలకమండలి సభ్యులు ఆచార్య చంద్రమతి శంకర్ మాట్లాడుతూ ఉన్నత స్థలాల్లో నిలిచేందుకు మహిళలు ప్రయత్నించాలన్నారు. వైవీయూ మహిళా సెల్ సమన్వయకర్త ఆచార్య పి. రమాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవం వెనుక ఉన్న చరిత్రను సంక్షిప్తంగా వివరించారు. సమానం అనేది ఇంటి నుంచే అలవాటు కావాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.కాత్యాయని, డా.ప్రమీల మార్గరేట్, డా.ఎల్.దాక్షాయణి, కె.వేణి సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చోరీ కేసులతో ఇద్దరు అరెస్టు

కొండాపురం : ముంపు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ గురువారం తెలిపారు ఎస్ఐ వివరాల మేరకు.. ముంపు గ్రామాలకు కేటాయించిన రూ.1.10 లక్షల విలువ గల విద్యుత్తు స్తంభాలను అనుమతి లేకుండా తరలిస్తున్న దత్తాపురం గ్రామానికి చెందిన మోహన్, అనిల్‌లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం తీసుకెళ్లారని ఫిర్యాదు



ధాన్యం చోరీ చేస్తున్న మహిళలను పట్టుకున్న రైతులు

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామ పొలాల్లో ధాన్యం దొంగిలిస్తున్న తొమ్మిది మంది మహిళలను రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. రాత్రి సమయాల్లో కొందరు మహిళలు కొన్ని రోజులుగా పొలాల్లో నిల్వ ఉంచిన ధాన్యం చోరీ చేస్తున్నారని రైతులు తెలిపారు. గురువారం రాత్రి కాపలా ఉండి తొమ్మిది మందిని పట్టుకున్నామన్నారు. యర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య విచారణ చేపట్టారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : పట్టణంలోని మహేశ్వర నగర్ కాలనీలో నివాసముండే నాగసుబ్బరాయుడు కుమార్తె సుప్రియ (23) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య తెలిపారు. సీఐ వివరాల మేరకు.. యర్రగుంట్ల పట్టణానికి చెందిన నాగసుబ్బరాయుడుకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో రెండో కుమార్తె సుప్రియ తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో పీజీ కోర్సు చదివింది. అయితే ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తుండగా, అది ఇష్టం లేకపోవడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓట్ల కోసమే టీడీపీ సానుభూతి

ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న సునీల్, ఇండిపెండెంట్ పాస్టర్లు

కడప కార్పొరేషన్ : ఓట్ల కోసమే టీడీపీ నాయకులు క్రిష్టియన్ మైనార్టీలపై సానుభూతి చూపుతున్నారని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కడప ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇటీవల క్రిష్టియన్ మైనార్టీలతో సమావేశం నిర్వహించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా వర్గాలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీలపై ఎన్నో దాడులు జరిగాయన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత దైవ సేవ చేస్తున్న పాస్టర్లు, అర్చకులు, మౌల్వీలకు గౌరవ వేతనం ఇస్తున్నారని గుర్తు చేశారు. క్రిష్టియన్ మైనార్టీలపై ఇంత ప్రేమాభిమానాలు చూపిస్తున్న జగన్నకు వారు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కిషోర్, పాస్టర్లు షడ్రక్ రాజు, పీడీకే దాస్, ప్రేమానందం, జానయ్య, సుధీర్, శ్రీనివాసులు డేవిడ్ రాజ్, వినోద్, సజ్జన్ పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో ఎమర్జెన్సీ మాక్ డ్రిల్

ఆయిల్ లీక్ ఘటనతో అప్రమత్తమైన కార్మికులు



గాయపడిన వర్కర్‌ను స్ట్రెచర్‌లో తీసుకెలుతున్న సిబ్బంది

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లోని ఎమర్జెన్సీ–1లోని పెట్రోల్ ట్యాంకర్‌లో గురువారం ఆయిల్ తీస్తుండగా లోపల రూప్ తిరగబడి ఆయిల్ లీక్ అయింది. మంటలు చెలరేగడంతో అక్కడ వర్కర్ ఫైర్ అని గట్టిగా అరిచారు. హెచ్‌పీసీఎల్ సిబ్బంది సైరన్ మ్రోగించారు. సిబ్బంది అప్రమత్తమై ఆటోమెటిక్ పరికరాలతో ఆ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో ఐఓసీ, ఏజీపి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది సహకారంతో పోమ్‌తో వాటర్‌తో మంటలను అదుపుచేశారు. పది మంది వర్కర్లకు ప్రమాదం జరగడంతో వారిని స్ట్రెచర్‌పై మెడికల్ క్యాంపు వద్దకు తీసుకొచ్చారు. వైద్యుడు డాక్టర్ శివకుమార్ పరీక్షించి ఆరుగురిని రిమ్స్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఇదంతా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మాక్‌డ్రిల్. అధికారులు కార్మికుల అప్రమత్తతను పరీక్షించారని, అందరూ స్పందించడం సంతృప్తికరంగా ఉందని కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ క్రిష్ణమూర్తి తెలిపారు. సిబ్బంది అప్రమత్తతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనూరాధ(ఏపీఎస్‌డిఎంఏ), హెచ్‌పీసీఎల్ డిపో చీఫ్ రీజనల్ మేనేజర్ మూల నాగసతీష్, డిపో మేనేజర్ బి.మన్మథరావు, అధికారులు ధర్మారావు, వై. ప్రసాద్, ఓబయ్య, సునీల్‌కుమార్‌పాండే, గోపాలక్రిష్ణ, వై.వెంకటేశ్వర్లు, ఏజీపీ రాజీవ్‌రాజన్, ధర్మారావు, రామచంద్ర, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు



మద్యం సీసాలతో సెబ్ అధికారులు

వాల్మీకిపురం : కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న జయదేవ్ వద్ద సంచిలో 180 ఎంఎల్ 8 టెట్రా ప్యాకెట్లు, 500 ఎంఎల్ 4 టిన్ బీర్ల కర్ణాటక మద్యం పట్టుబడడంతో సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా కర్ణాటక మద్యం అక్రమ రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దస్తగిరి, అబ్దుల్లా, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పాండిచ్చేరి మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవీ సర్కిల్ వద్ద మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్ఐ కిశోర్, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.60 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.పాండిచ్చేరి రాష్ట్రం నుంచి ఇక్కడికి అక్రమంగా మద్యం తెచ్చుకొని ప్రొద్దుటూరుతోపాటు జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో అధిక రేట్లకు విక్రయించేవారన్నారు. స్టేషన్ పరిధిలో అక్రమ మద్యంతో పాటు ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. మట్కా జూదం, పేకాట, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



పాత్రికేయులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి : ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్రపై విలేకరులకు డీసీసీ బ్యాంక్ డీఆర్‌ఓఎస్‌డీ గుర్రప్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కుతో సరైన నాయకుడిని ఎన్నుకునేలా ఓటర్లకు సహాయపడాలని తెలిపారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి మీడియా సహకరించాలన్నారు. ఎన్నికల్లో వాస్తవ విషయాల కంటే అసత్యమైన విషయాలే త్వరగా వ్యాప్తి చెందుతాయన్నారు. కావున ఫేక్ న్యూస్ కాకుండా సత్యమైన, వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారం అయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అధికారిక సమాచారాన్ని ఐఅండ్‌పీ ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి, భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, ధర్మానాయక్, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ, విలేకరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

• ఐచర్ వాహనం ఢీకొని



పోలయ్య (ఫైల్)

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు నందలూరు మండలం కుమ్మరపల్లెకు చెందిన పోలయ్య (45) స్కూటర్‌లో కడపకు వెళ్తుండగా కడప వైపుగా వస్తున్న ఐచర్ వాహనం ఒంటిమిట్టలోని స్థానిక షాదీఖాన వద్ద ఢీకొంది. పోలయ్యను కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు.

• ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొనడంతో...



జి వెంకటరమణ

మదనపల్లె : పట్టణంలోని అనపగుట్టకు చెందిన జి ఎల్లప్ప(48), తన స్నేహితుడు గుర్రంకొండకు చెందిన జి వెంకటరమణతో కలసి ద్విచక్ర వాహనంలో వాల్మీకిపురం వెళ్తున్నారు. శానిటోరియం వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేట్ అంబులెన్స్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న ఎల్లప్ప అక్కడికక్కడే దుర్మరణం చెందగా, తీవ్రంగా గాయపడిన జి వెంకటరమణను 108 వాహనంలో తిరుపతికి తరలిస్తుండగా పీలేరు సమీపంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. తాలూకా ఎస్ఐ వెంకటేష్ కేసు విచారణ చేస్తున్నారు.

• జేసీబీ ఢీకొనడంతో...

మదనపల్లె : బైక్‌ను జేసీబీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. కుటుంబీకుల వివరాల మేరకు మండలంలోని కొత్తపల్లి పంచాయితీ, బండికిందపల్లెకు చెందిన రహంతుల్లా(40) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళుతుండగా, నాయునోరిపల్లి వద్ద ఎదురుగా వచ్చిన జేసీబీ ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన రహంతుల్లాను స్థానికులు ప్రైవేట్ ఆటోలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లికి చెందిన కిషోర్ కుమార్ భార్య వసంత కుమారి (21) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కురబలకోటలోని మర్రిమాను వీధికి చెందిన రెడ్డప్ప కుమార్తె రెడ్డి రాణి (20), కుటుంబ సమస్యలతో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. బి కొత్తకోట మండలం గోళ్లపల్లె కు చెందిన రామయ్య కుమార్తె కవిత (22), తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెంది నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగకు ఆరు నెలల జైలు

రాయచోటి టౌన్ : సెల్ ఫోన్ చోరీలకు పాల్పడిన నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇఫ్రాత్ ఫాతిమా తీర్పు చెప్పారు. టి.సుండుపల్లె ఎస్ఐ ఎస్‌కెఎం.హుస్సేన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుండుపల్లె మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంతలో జన సందోహం ఉన్న ప్రదేశంలో అదే మండలానికి చెందిన గుడిటి పవన్ కుమార్‌పై అప్పటి ఎస్ఐ భక్తవత్సలం సెల్‌ఫోన్ చోరీ కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా విచారణలో నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లుగా ఎస్సై తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది జి.సుజాత వాదించినట్లు తెలిపారు.

విద్యుత్తు షాక్‌తో చిన్నారికి గాయాలు



తీవ్రంగా గాయపడిన చిన్నారి రోహిత్

మదనపల్లె : విద్యుత్తు షాక్ తో చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగింది. బోరింగ్ వీధికి చెందిన చిన్నారెడ్డి, కస్తూరి దంపతుల కుమారుడు లోహిత్(05) ఇంట్లో వాటర్ హీటర్‌ను తాకి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వాటర్ హీటర్‌ను ఆఫ్ చేయడం తండ్రి చిన్నారెడ్డి మరిచిపోవడంతో, ప్రమాదవశాత్తు చిన్నారి ముట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అడవి జంతువనుకుని ఆమెను.. కాల్చారు

మహిళపై తుపాకీ కాల్పుల ఘటనలో ముగ్గురు అరెస్ట్



తుపాకీ కాల్పుల ఘటనలో నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రసాద్ రెడ్డి.

మదనపల్లె : అడవిలో వేటకు వెళ్లిన కొందరు... జంతువనుకుని నాటు తుపాకీతో ఎస్టీ మహిళపై కాల్పులు జరిపారని డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గత జనవరి 29వ తేదీన సాయంత్రం మదనపల్లి మండలం మాలేపాడు పంచాయతీ ఆవులపల్లెకు చెందిన దిన్నెపాటి సిద్ధప్ప భార్యపాపులమ్మ (50), గ్రామానికి సమీపంలోని అడవి వద్ద రాగి పొలంలో పనిచేసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన శివ శ్రీరాములు(48), అతని స్నేహితులు మండెం నాగరాజా (38), గోళ్ల శ్రీనివాసులు(45) అటవీ జంతువుల వేటకు వెళ్లారు. పాపులమ్మ పొలంలో పనులు చేస్తుండగా, వేటగాళ్లు అటవీ జంతువు అనుకుని నాటు తుపాకీతో కాల్పులు జరిపారు .గాయపడిన ఆమెను హుటాహుటిన స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికుమార్ విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందంతో నిందితులను మదనపల్లి- రామసముద్రం మార్గంలోని మాలేపాడు క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నాటు తుపాకీ, సీసము రవ్వలు, నల్లమందు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ శేఖర్, ఎస్ఐ రవికుమార్ తో పాటు దర్యాప్తు బృందాన్నిడీఎస్పీ అభినందించారు.

యాళివాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు



యాళివాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి బ్రహ్మోత్సవాలలో భా గంగా గురువారం యాళివాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి రాయచోటి పురవీధులలో ఊరేగారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు పూజలు చేసి రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. యాళి వాహనం ఉంచి పట్టణ పురువీధులలో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

దివ్యాంగురాలి గెంటివేతపై ఫిర్యాదు

మదనపల్లె : బంధువులే రాబందులై దివ్యాంగురాలిని ఇంటి నుంచి గెంటివేసిన ఘటనపై బాధితురాలు రజిత అక్క గంగాదేవి, మహాకార్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ, ఏపీ దివ్యాంగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర శేఖర్ కలిసి, తాలూకా సీఐ ఎస్.శేఖర్‌కు ఫిర్యాదు చేశారు. రజితపై పలుమార్లు ఇటువంటి ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ తిరుపతి సంఘం ఇన్‌చార్జ్‌లు రెడ్డయ్య పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యదర్శి రఘు, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.